సాక్షి
సిద్దిపేట

శనివారం, 8, జూన్, 2024







## పాలన పట్టాలెక్కేనా

ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. కోడ్ ముగిసిన నేపథ్యంలో జిల్లాలో అభివృద్ధి పరుగులు పెట్టనుంది.

వివరాలు 8లో ▸



## నేరేడు.. లాభాలు బోలెడు

సహజ సిద్ధంగా లభించే ఫలాల్లో అల్ల నేరేడు పండ్లు ప్రముఖంగా నిలుస్తాయి. తియ్యదనం, పులుపు, వగరు మేలు కలయికే అల్ల నేరేడు పండు.

వివరాలు 8లో ▸



## బడిబాట కోసం ఇంటింటికీ..

ప్రభుత్వం బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలనే లక్ష్యంతో చేపట్టిన బడిబాట కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది.

వివరాలు 9లో ▸

## నేడు డీఏఓతో ఫోన్ ఇన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సాక్షి ఆధ్వర్యంలో శనివారం 'ఫోన్ ఇన్ డీఏఓ' కార్యక్రమం జరగనుంది. వానాకాలం సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య నేరుగా ఫోన్ ద్వారా జిల్లా వ్యవసాయశాఖ అధికారి మహేశ్‌తో మాట్లాడి సలహాలు, సూచనలను పొందవచ్చు. విత్తనాలు, ఎరువుల యాజమాన్యం, నకిలీ విత్తనాలను గుర్తించడం తదితర అంశాలపై సందేహాలను నివృత్తి చేయనున్నారు.



తేదీ : 08-06-2024

ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

రైతులు ఫోన్ చేయాల్సిన నంబర్లు

**86869 60064, 90104 55525**

## న్యూస్‌రీల్

### నేడు జాతీయ లోక్ అదాలత్




మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి

సిద్దిపేటకమాన్: సిద్దిపేట కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు. సిద్దిపేట కోర్టులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో న్యాయమూర్తి స్వాతిరెడ్డితో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 8 బెంచ్‌లు ఏర్పాటు చేశామని, 2,328 కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించే దిశగా కసరత్తు చేస్తున్నామని తెలిపారు. లోక్ అదాలత్‌లో పలు సివిల్, క్రిమినల్, రోడ్డు ప్రమాద, ఎలక్ట్రిసిటీ, ఇన్సురెన్స్, బ్యాంకు, చెక్ బౌన్స్‌లతో పాటు ఇతర కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులకు కోర్టు ఫీజులు తిరిగి ఇస్తారన్నారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి స్వాతిరెడ్డి పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

అక్కన్నపేట(హుస్నాబాద్): వానాకాలం సమీపిస్తున్నందున సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. అక్కన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి అందుతున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. ఆరోగ్య కార్యక్రమాల వివరాలు, రికార్డులు, ఫార్మసీ స్టోర్‌కు వెళ్లి మందుల పంపిణీ రిజిస్టర్లను పరిశీలించారు. సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు ముందస్తుగా మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ల్యాబ్ సేకరించిన పరీక్షల నమూనాలను టీహబ్‌కు పంపించాలన్నారు. గర్భిణుల నమోదు, ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమ్య, సిబ్బంది వినీత, ప్రకాష్, జమీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లాల లెక్క.. ఇక పక్కా




మిషన్ భగీరథ పథకంలో భాగంగా నల్లాల ద్వారా ఇంటింటికీ సురక్షితమైన తాగునీటిని అందిస్తున్నారు. అయితే నివాసాలకు, నల్లాల సంఖ్యకు పొంతన కుదరడం లేదు. దీంతో ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్ని నల్లా కనెక్షన్లు ఉన్నాయో లెక్క తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో సర్వే నిర్వహించి ప్రత్యేక యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేయనున్నారు. ఈ సర్వే త్వరలో ప్రారంభం కానుంది. – సాక్షి, సిద్దిపేట

**త్వరలో ఇంటింటి సర్వే**

- జిల్లాలో 499 గ్రామ పంచాయతీలు
- 2.57 లక్షల నివాసాలు
- భగీరథ నల్లా కనెక్షన్లు 2.10లక్షలు
- సర్వే కోసం 1,038 సిబ్బంది నియామకం
- ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు

జిల్లాలోని 499 గ్రామ పంచాయతీలలో 2,57,044 నివాసాలు ఉండగా మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు 2,10,773 మాత్రమే ఉన్నాయి. నివాసాల కంటే నల్లా కనెక్షన్లు తక్కువగా ఉండటంతో పూర్తి స్థాయిలో సురక్షితమైన తాగునీరు అందడం లేదని గుర్తించారు. పలు చోట్ల నల్లా నీళ్లు రావడంలేదని ఇటీవల మిషన్ భగీరథ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంటింటి సర్వే నిర్వహించి ఇంకా ఎక్కడెక్కడ నల్లా నీళ్లు రావడంలేదో గుర్తించాలని, రిపోర్టును రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరీమా ఆధ్వర్యంలో పది రోజుల పాటు గ్రామాల వారీగా సర్వే చేపట్టనున్నారు. సర్వే కోసం 1,038 మందిని నియమించారు. ఇందులో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వీఓలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు. వీరికి ఇటీవల యాప్ పై శిక్షణ సైతం ఇచ్చారు.

**రోజుకు 20 నుంచి 25 ఇళ్లలో..**

ప్రతి ఒక్కరు రోజుకు 20 నుంచి 25 ఇళ్లలో సర్వే నిర్వహించాలి. ఇంటింటికీ వెళ్లి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా? నల్లా కనెక్షన్ ఉందా? పైపుల ద్వారా నీళ్లు వస్తున్నాయా? ఎన్ని రోజులకోసారి వస్తోంది? లబ్ధిదారు పేరు, చిరునామా, భార్య/భర్త ఇతర కుటుంబ సభ్యుల వివరాలు, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్, ఇంటి నంబర్, ఇతర వివరాలను నమోదు చేస్తారు. లబ్ధిదారుతో కలిపి ఇంటి ఫొటోను, నల్లా ఫొటోను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. మిషన్ భగీరథ ద్వారా నీళ్లు వస్తున్నాయా లేక స్థానికంగా ఉన్న బోర్లు, చెరువులు ద్వారా వస్తోందా అనే విషయం పేర్కొనాలి. వివరాలు నమోదు సందర్భంగా మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా అసలైన లబ్ధిదారా, కాదా అన్నది ధ్రువీకరించాలి. ఆన్‌లైన్‌లో వెంటవెంటనే సమాచారం రాష్ట్ర, జిల్లా, మండల కార్యాలయానికి వెళ్తుంది. ఇలా వచ్చిన నివేదిక ఆధారంగా కేంద్రానికి చెందిన జల్ జీవన్ మిషన్‌కు పంపించనున్నారు.

**అందరూ సహకరించాలి...**



ఇంటింటికీ సర్వే కోసం వచ్చే వారికి గృహ యజమానులు, వారి కుటుంబ సభ్యులు సహకరించాలి. వారికి పూర్తి వివరాలు తెలపాలి. త్వరలో సర్వే ప్రారంభం కానుంది. ఈ సర్వే పది రోజుల్లో పూర్తి చేయాలి. ఇప్పటికే సర్వే చేసే వారికి శిక్షణ ఇచ్చాం. ఇంటింటికీ తిరిగి సమగ్రంగా వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. – దేవకీదేవి, డీపీఓ

## అవకతవకలకు తావివ్వొద్దు

- గ్రూప్ 1 ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు
- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- అధికారులకు దిశానిర్దేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: జిల్లాలో ఆదివారం జరిగే గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పగడ్బందీగా విధులు నిర్వహించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో అదనపు కలెక్టర్, గ్రూప్ 1 ఫిలిమ్స్ పరీక్షల నోడల్ అధికారి గరీమా అగర్వాల్ ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణపై అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీజీపీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష 9న ఉన్నందున శనివారం నాటికి 21 పరీక్ష కేంద్రాలలో అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలన్నారు. డిపార్ట్‌మెంట్ అధికారులు అన్ని పరీక్షా కేంద్రాలను సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించాలన్నారు. పరీక్ష రోజు ఉదయం 5:30 గంటలకే పరీక్ష మెటీరియల్ ఉన్న స్ట్రాంగ్ రూముకు వెళ్లి పరీక్ష సామగ్రిని గట్టి పోలీస్ బందోబస్తుతో వెళ్లి పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్‌కు అందించాలన్నారు. పరీక్ష అనంతరం మళ్లీ ఎస్కార్ట్ వాహనంతో స్ట్రాంగ్ రూమ్‌కు చేరవేయాలన్నారు. ఐడెంటిఫికేషన్ అధికారులు పరీక్ష కేంద్రాల్లోకి వచ్చే అభ్యర్థుల హాల్ టికెట్‌ను, ఇతర గుర్తింపు కార్డులను పరిశీలించి లోపలికి పంపాలన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించాలన్నారు. జిల్లాలో మొత్తం 8,223 మంది పరీక్ష రాయనుండగా వారిలో 13 మంది అంధదివ్యాంగ అభ్యర్థులు ఉన్నారని, వారికి ఇంటర్మీడియెట్ వరకు మాత్రమే చదివిన వారిని సహాయకులుగా నియమించి పరీక్ష రాయించాలన్నారు. పరీక్ష సమయం పూర్తయ్యే వరకు ఎవరు బయటకు వెళ్లడానికి వీలులేదని, పరీక్ష హాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదన్నారు.

**పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్**

సిద్దిపేటకమాన్: గ్రూప్ 1 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సీపీ అనురాధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిబంధనలు అమల్లో ఉంటాయని చెప్పారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసి వేసి ఉంచాలన్నారు. మొత్తం 298 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

## 20లోగా పనులు పూర్తి చేయండి

- పునఃప్రారంభంలోపే బడులను సిద్ధం చేయాలి
- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సిద్దిపేటరూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను ఈనెల 20లోగా పూర్తిచేయాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్లు, విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద జిల్లాలోని 814 బడుల్లో విద్యుత్, తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీల మరమ్మతు పనులను చేపడుతున్నామన్నారు. ఇప్పటికీ 176 పాఠశాలలలో నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. మిగతా పాఠశాలలలో చేపట్టిన పనులు పూర్తి కాకపోవడంపై పంచాయతీరాజ్, ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. నిర్మాణం చివరి దశలో ఉన్న పాఠశాలలలో రంగులు పూర్తిచేసి 12లోగా అందించాలన్నారు. మిగతా పాఠశాలల్లో ఈనెల 20వ తేదీలోగా వందశాతం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పూర్తి చేయని అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. విద్యార్థులు సౌకర్యవంతంగా చదువుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. రూ. 32 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టగా ఇప్పటికీ రూ.8 కోట్లు చెల్లించామన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో పనులు చేపట్టి నిర్మాణ ప్రగతి సరిగా లేని పాఠశాలలను, అసలే పనులు ప్రారంభించని పాఠశాలలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారితో కలిసి సందర్శించి త్వరగా నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. సోమవారం అన్ని మండలాల్లో ఎంపీడీవోలు, ఎంఈఓలు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, ఐకెపి వివోలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈలు, డిఈలు, ఎఈలు, ఈడబ్ల్యూఐడిసి ఈఈ, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 'డబుల్ బెడ్రూం'లు ఇవ్వాల్సిందే



ఆందోళనకు దిగిన లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

- ఇళ్ల లబ్ధిదారుల డిమాండ్
- మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన

గజ్వేల్‌రూరల్: డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు ఆందోళన బాట పట్టారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు. సంగాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ సందర్భంగా డ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు గృహ ప్రవేశాలు చేయించకుండా ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదని మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది క్రితం లబ్ధిదారుల ఎంపిక నిర్వహించి గృహ ప్రవేశాలు చేయించకుండా ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. గతంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నాకు దిగగా ఆర్డీవో వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. ఇదే క్రమంలో ఎన్నికలు ముగిసిన తర్వాత డబుల్ బెడ్రూంల పంపిణీకి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ యాదవరెడ్డి సైతం ప్రకటించారని గుర్తు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి లబ్ధిదారులు ఎమ్మెల్సీ యాదవరెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి లబ్ధిదారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా... లబ్ధిదారులంతా ఎమ్మెల్సీతో ఆందోళనకు దిగారు. అనంతరం ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ అప్పటి కలెక్టర్ నేతృత్వంలో లబ్ధిదారుల ఎంపిక జరిగిందని అన్నారు. వచ్చే బుధవారం ప్రస్తుత కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో సమస్యకు పరిష్కారం లభించకపోతే మరోసారి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని లబ్ధిదారులు హెచ్చరించి ఆందోళనను విరమించారు.

## సాంద్రత పద్ధతిలో అధిక దిగుబడి

మర్కూక్(గజ్వేల్): అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తే దిగుబడులు గణనీయంగా పెరుగుతాయని మండల వ్యవసాయ అధికారి నాగేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇప్పలగూడెం గ్రామంలో రైతులకు పత్తి సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో వంగడాలు, పంట కాలం తక్కువగా ఉంటుందన్నారు. దీనివల్ల త్వరగా కాయలు, పూత వచ్చి 20 నుంచి 30 వరకు అధికంగా కాయలు వస్తాయన్నారు. హైబ్రిడ్ రకం సాగులో వంగడాలు ఎకరానికి 4938 నుంచి 7407 మొక్కల వరకు కాయలు కాయడం వల్ల పంట కాలం పెరగడం, తద్వారా గులాబి రంగు పురుగు ఉధృతితో దిగుబడి ఆశించిన మేరకు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

## సీఎం వ్యాఖ్యలు అర్థరహితం

- ఇప్పటికైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలి
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: మెదక్ ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపునకు మాజీ మంత్రి హరీశ్‌రావు కారణమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడటం తగదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, రేవంత్‌రెడ్డి అనాలోచితంగా మాట్లాడటం దారుణమన్నారు. ఇప్పటికైనా అర్థరహితమైన విమర్శలను మానుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్‌కు గెలుపోటములు సహజమేనని, ఓడినా, గెలిచినా తెలంగాణ ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. మెదక్ ఎంపీ ఎన్నికలకు సంబంధించి గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు 20వేల మెజారిటీ అందించిన నియోజకవర్గ ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని చెప్పారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.170కోట్ల పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ కాల్వల పనులను పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, బీఆర్‌ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు విరాసత్‌అలీ, మాజీ జెడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య, మాజీ సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త వంగడాలపై దృష్టి సారించండి




సమావేశంలో కిసాన్ సెల్ నేతలు

పాపన్నపేట(మెదక్): రైతులు కొత్త వంగడాలపై దృష్టి సారించాలని కాంగ్రెస్ మెదక్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో జరుగుతున్న స్టేట్ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమావేశంలో వివిధ దేశాలకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారన్నారు. రైతులు మూస పద్ధతిలో పంటలు పండించకుండా మారుతున్న పరిస్థితులు, కొత్త వంగడాలు, అధిక దిగుబడి వచ్చే వరి పంటను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటూ దిగుబడులు పెంచుకోవాలన్నారు. కార్యక్రమానికి వివిధ జిల్లాల కిసాన్ సెల్ అధ్యక్షులతో పాటు రైస్ మిల్లర్లు, రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

## బడి బస్సు భద్రమేనా?

- వాహనాల ఫిట్‌నెస్‌పై అధికారుల తనిఖీలు
- జిల్లాలో 372 స్కూల్ బస్సులు
- ఇప్పటి వరకు 155 వాహనాల పరిశీలన
- సక్రమంగా లేకుంటే సీజ్ చేస్తామంటూ హెచ్చరిక

ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ముమ్మరంగా తనిఖీలు చేస్తూ ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లడం ఎంత ముఖ్యమో తిరిగి భద్రంగా ఇంటికి చేరడం అంతే ప్రధానం. అందుకు పాఠశాల యాజమాన్యాలు విధిగా విద్యార్థులకు భద్రతపై భరోసా కల్పించాలి. పిల్లల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్నారు. అయితే బాధ్యతగా ఉండాల్సిన పాఠశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

– ప్రశాంత్‌నగర(సిద్దిపేట)




ప్రైవేట్ పాఠశాల బస్సును పరిశీలిస్తున్న రవాణా శాఖ అధికారులు, సిబ్బంది

జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు కొనసాగుతున్నాయి. రవాణాశాఖ అధికారులు ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలిస్తున్నారు. ఎలాంటి లోపాలు ఉన్నా వాటిని సరిచేయించాకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తున్నారు. జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన 372 బస్సులు నిత్యం విద్యార్థులను తరలిస్తున్నాయి. అందుకు ప్రతిఏటా బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 155 బస్సులకు ఫిట్‌నెస్ చేయగా, ఇంకా 217 వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయాల్సి ఉంది. గడువు లోగా ఫిట్‌నెస్ చేయించాలని, గడువు దాటితే జరిమానా విధిస్తామని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. తప్పనిసరిగా ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులకు ఈ నెల 15లోగా రవాణాశాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ చేయించాలని అధికారులు తెలిపారు.

**నిబంధనలు తప్పనిసరి**

పదిహేనేళ్లు గడిచిన బస్సులకు ఫిట్‌నెస్ చేయలేమని, అలాంటి వాహనాలు పాఠశాల విద్యార్థుల ప్రయాణాలకు వాడరాదని అధికారులు పేర్కొంటున్నారు. తప్పనిసరిగా నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేయడంతో పాటు, వాటి యజమానులకు కూడా శిక్షలు విధించే అవకాశం ఉందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రయాణించే వాహనాలు సక్రమంగా ఉన్నాయో లేవో తెలుసుకోవాలి. బస్సులో లోపాలుంటే సంబంధిత పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేయాలి. అలాగే పాఠశాల యాజమాన్యాం తమ వాహన డ్రైవర్‌లకు తప్పని సరిగా శిక్షణ ఇవ్వాలి, డ్రైవర్లకు తప్పని సరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలి. తదితర అంశాలపై రవాణాశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

**అన్నీ ఆన్‌లైన్‌లోనే..**

తొలుత చేయించే ఫిట్‌నెస్ పరీక్షలకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేయించాల్సి ఉంటుంది. పాఠశాలకు సంబంధించిన వివరాలు, రిప్రజెంటేషన్‌పై డిజిగ్నేషన్, సెల్ నంబర్, బస్సు వివరాలు, అటెండెంట్, డ్రైవర్ వివరాలు, వారి ఫొటోలు, బస్సులు నడిచే మార్గాలు, సీట్ల పరిమితి తదితర విషయాలు దరఖాస్తుల్లో పొందుపర్చాలి.

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు**



చిన్నారుల క్షేమమే మా లక్ష్యం. రవాణాశాఖ అనుమతులు లేకుండా పాఠశాల యాజమాన్యాలు స్కూల్ బస్సులు నడిపితే కఠినంగా వ్యవహరిస్తాం. అలాంటి బస్సులను సీజ్ చేస్తాం. ఈ నెల 15 నుంచి ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తాం. అంతకుముందే సంబంధిత పాఠశాలల బస్సులను ఫిట్‌నెస్ చేయించుకోవాలి. అనుభవం ఉన్న డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలి. కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి.

–శంకర్‌నారాయణ, ఎంవీఐ, సిద్దిపేట

## క్లుప్తంగా

### మల్లన్న గుట్టలో పులి సంచారం?

భయాందోళనలో సమీప గ్రామాల ప్రజలు

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులోని మల్లన్న గుట్ట ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం పులి సం చరిస్తున్నట్లు మేకల కాపరి చూసి చెప్పడంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళన గుర వుతున్నారు. హత్నూర బ్రాహ్మణ గూడా గ్రామాల మధ్యలో ఉన్న మల్లన్న గుట్ట ప్రాం తంలో బ్రాహ్మణ గూడా గ్రామానికి చెందిన మేకల కాపరి రమేశ్ అనే వ్యక్తి పులి కనిపించిం దని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెం టనే ఎస్ఐ సుభాష్ అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించినట్టు తెలిపారు. దీంతో పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని పుకార్లు షికార్లు అయ్యాయి. శనివారం ఉదయం పరిసర ప్రాంతాలను పరిశీలిస్తామని ఎస్ఐ తెలిపారు.

### అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు



పతకాలతో క్రీడాకారులు

సిద్దిపేటజోన్: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కన బర్చారు. హన్మకొండలో జరిగిన మీట్‌లో హై జంప్‌లో ఇంద్రాణి బంగారు పతకం, జావెలి న్‌త్రో లో శ్రీకాంత్ బంగారు పతకం, వివిధ పోటీల్లో ఆనంద, సంతోష్, గణేశ్, జితేశ్, అభిషేక్‌లు వెండి, కాంస్య పతకాలు సాధిం చారు. వీరిని జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు సాయిరాం, పరమేశ్వర్, రవీందర్ రెడ్డి, వెంకట్ స్వామి, రామేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు అభినందించారు.

### డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డిబార్

ఆందోళనకు దిగిన విద్యార్థులు



చీఫ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థులు

రామాయంపేట(మెదక్): డిగ్రీ ఫైనల్ ఇయర్ ఇంగ్లిష్ పరీక్షలో ఐదుగురు విద్యార్థులు డిబార్ కావడం రామాయంపేటలో ఆందోళనకు దారితీసింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమశాఖ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 246 మంది విద్యార్థులు డిగ్రీ పరీక్ష రాశారు. ఎగ్జామ్ అబ్జర్వర్‌గా వచ్చి న వ్యక్తి ఐదుగురు విద్యార్థులను పట్టుకొని కాపీ కొడుతున్నారని ఆరోపిస్తూ డిబార్ చేశారు. అయితే ఆ ఎగ్జామ్ అబ్జర్వర్ ప్రస్తుతం ఏ కళాశాలలో పని చేయకపోయినా యూనివ ర్సిటీ నుంచి లెటర్ తెచ్చుకొని విధులు నిర్వర్తిం చారని విద్యార్థులు ఆరోపించారు. దీంతో విద్యార్థులంతా కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వచ్చి వారిని సము దాయించారు. ఈ విషయమై విద్యార్థులు చీఫ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. అబ్జర్వర్‌కు విద్యార్థులను డిబార్ చేసే అధి కారం ఉండదని, కేవలం ఎగ్జామ్ సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే అధికారం ఉం టుందని తెలిపింది.

### కల్తీ డీజిల్ పోశారని ఆందోళన

వట్‌పల్లి(అందోల్): కల్తీ డీజిల్ పోశారని ఆరోపిస్తూ ఓ వ్యక్తి పెట్రోల్ బంకు వద్ద ఆం దోళనకు దిగాడు. ఈ ఘటన అందోలు మం డల పరిధిలోని రాంసానిపల్లి గ్రామ శివా రులోని జియో పెట్రోల్ బంకు వద్ద చోటు చేసు కుంది. జోగిపేట పోలీసుల కథనం మేరకు.. అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన పోచయ్య గురువారం సాయంత్రం జియో పెట్రోల్ బంకులో రూ.3,500 విలువ డీజిల్ డబ్బాలో పోసుకొని వెళ్లాడు. తన ట్రాక్ టర్‌లో కొంత పోసి చూడగా స్టార్ట్ కాలేదు. వెంటనే డీజిల్‌ను పరిశీలించి బంకుకు వెళ్లి కల్తీ డీజిల్ పోశారని నిర్వాహకులతో వాగ్వాదానికి దిగాడు. విషయం తెలుసుకున్న పోలీసులు బంక్‌కు వెళ్లి కల్తీ జరిగిందని ఆరోపిస్తున్న డీజి ల్‌ను తీసుకెళ్లారు. ఈ విషయమై బంక్ యాజ మాన్యంతో మాట్లాడగా డీజిల్ కల్తీ జరగలేద ని, పెట్రోల్ నాణ్యత కోసం కలిపే పదా ర్థాలతో డీజిల్ రంగుమారిందే తప్ప ఎటువం టి కల్తీ జరుగలేదన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ త్రివేణి హోమ్స్ హైదరాబాద్ నందు వృద్ధు లను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం : 18K. Ph : 9160900024, 9640400073 [H-799887]

గమనిక

సాక్షి దినపత్రికలో ప్రచురితమయ్యే ప్రకటనలు ... పాఠకులు తమ స్వంత విచక్షణతో వ్యవహరించాలి ...

# పాలన పట్టాలెక్కేనా?

నేటితో ముగియనున్న ఎన్నికల కోడ్

- జిల్లాలో ప్రారంభంకానున్న పనులు
- త్వరలోనే ప్రజావాణి కార్యక్రమం
- వేగం పుంజుకోనున్న సంక్షేమ పథకాల అమలు
- ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు




ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో జిల్లాలో అభివృద్ధి పరుగులు పెట్టనుంది. నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలలకే పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చింది. దాదాపు మూడు నెలలపాటు కోడ్ కొనసాగింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఆ కోడ్ కొనసా గుతుండగానే వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వచ్చింది. నేటి (శనివారం)తో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కూడా ముగుస్తుంది.

– సాక్షి, సిద్దిపేట

గతేడాది అక్టోబర్ 9వ తేదీ నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు అసెంబ్లీ, మార్చి 16 నుంచి జూన్ 6వ తేదీ వరకు పార్లమెంట్ ఎన్నికల కోడ్, అనంతరం రెండు రోజుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉంది. ఇలా వరుస ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ పరిధిలో సిద్దిపేట జిల్లాకు చెందిన చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలు వస్తాయి. దీంతో ఎమ్మెల్సీ కోడ్ సైతం జిల్లాలో కొనసాగు తుంది. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ఆరు నెలల్లో మూడు నెలల పాటు ఎన్నికల కోడ్‌లోనే కొనసాగింది. దీంతో ప్రభుత్వం నూతనంగా అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

## నిధులు మంజూరైనా.. నిలిచిన పనులు

ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రతీ అసెంబ్లీ నియోజక వర్గానికి అభివృద్ధి నిధుల కింద రూ.10 కోట్లను మంజూరు చేశారు. అందులో రూ.2 కోట్లను ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు, అలాగే రూ.కోటి తాగు నీటి సరఫరా కోసం, మిగితా డబ్బులు పలు అభివృద్ధి పనులకు కేటాయించనున్నారు. కేటాయించిన కొద్ది రోజులకే ఎన్నికల కోడ్ రావడంతో ఎస్టిమేషన్ దశలోనే పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి ఎన్నికల కోడ్ వరకు ఎంపికైన వారికి మాత్రమే అందు తోంది. ప్రజాపాలనలో భాగంగా ఐదు గ్యారంటీలు 11 పథకాలకు 14,56,516 దరఖాస్తులు వచ్చాయి. ఎన్నికల కోడ్‌తో వివిధ పథకాలకు అర్హుల ఎంపిక పూర్తి స్థాయిలో జరగలేదు. నేడు కోడ్ ముగియ గానే అర్హుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రభుత్వ హామీల అమలు వేగవంతం కానున్నాయి. అలాగే రైతు రుణ మాఫీ సైతం జరగనుంది.

### ప్రారంభం కానున్న ప్రజావాణి

ప్రజల సమస్యలను విన్నవించుకునేందుకు నిర్వహించే ప్రజావాణి మూడు నెలలుగా ఎన్ని కల కోడ్‌తో నిలిచిపోయింది. దీంతో ప్రజల సమస్యలు పేరుకుపోయాయి. జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పునఃప్రారంభించనున్నారు. ప్రజలు తమ సమస్యలు విన్నవించుకొనేందుకు రాను న్నారు.ఈ ప్రజావాణిలో జిల్లా అధికారులు అం దరూ పాల్గొననుండటంతో సమస్యలు త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉండటంతో ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు.

# నేరేడు.. లాభాలు బోలెడు

- ఔషధ పోషకాల నిధిగా అల్లనేరేడు పండ్లు
- పలు రకాల వ్యాధులు దూరం
- మార్కెట్‌లో మంచి డిమాండ్



అల్ల నేరేడు పండ్లు

మిరుదొడ్డి(దుబ్బాక): తియ్యదనం, పులుపు, వగరు మేలు కలయికే అల్ల నేరేడు పండు. నల్లగా నిగని గలాడే అల్ల నేరేడు పండ్లను చూస్తే ఎవ్వరికైనా నోరూరాల్సిందే. సహజ సిద్ధంగా లభించే ఫలాల్లో అల్ల నేరేడు పండ్లు ప్రముఖంగా నిలుస్తాయి. ప్రస్తుతంలో లభించే పండ్లు ఎన్ని ఉన్నా సరే సినీ, జానపద గేయ రచయితలు మాత్రం అల్లనేరేడు పండ్లపై పాటల రూపంలో బాణీలు కట్టడం విశేషం. ఏ పండ్లకు లేని పొడువు కథలు సైతం ఒక్క అల్లనేరేడు పండ్లకు ఉండటం మరింత విశేషంగా చెప్పుకోవచ్చు.

## పలువురికి ఉపాధి సైతం

ప్రతీ ఏడాది ఏప్రిల్ నెలలో పూత కాత మొదలై జూన్, జూలై వరకు పండ్లు పుష్కలంగా లభి స్తాయి. సీజను సెలక్షన్లో సహజ సిద్ధంగా దొరికే అల్లనేరేడు పండ్లతో కొందరికి మంచి ఉపాధిగా మారుతోంది. మార్కెట్లో వివిధగా లభించే అల్లనేరేడు పండ్లకు మంచి డిమాండ్ ఏర్పడుతుంది. ఒక్క పండులోనే కాకుండా అల్లనేరేడు ఆకులు, బెరడులో కూడా మంచి ఔషధ పోషకాలు నిక్షిప్తమై ఉన్నాయని డాక్టర్లు సైతం చెబుతున్నారు. పండ్లలో ఆమ్లాలు, విటమిన్లు, సోడియం, పొటాషియం, ఐరన్ వంటి పోషకాలు మెండుగా ఉంటాయని సెలవిస్తు న్నారు. పండ్లలో ఐరన్ పుష్కలంగా లభిస్తుం డటంతో రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా రక్త హీనతను తగ్గిస్తాయంటున్నారు. ముఖ్యంగా మధుమేహ వ్యాధిని చక్కగా నియంత్రిస్తుందం టున్నారు డాక్టర్లు.

### గుండె వ్యాధులు నివారణ



ఫలాలలో చెప్పుకోదగిన పండ్లల్లో నేరేడు పండు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. గుండె సంబంధిత వ్యాధులను నయం చేస్తాయి. రక్తపోటును నివారించడమే కాకుండా కాలేయ పని తీరును మెరుగు పరుస్తుంది. మోతాదుగా తింటే ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది. అధిక మోతాదులో పండ్లను తింటే మాత్రం వెగటు పుట్టడమే కాకుండా మలబద్ధకం సమస్య వస్తుంది. పండ్లలో సీ విటమిన్ పుష్కలం గా ఉండటం వల్ల రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు, ఎముకలకు పరిపుష్టిని ఇస్తుంది.

– డా. అమీనా సుల్తానా, పీహెచ్‌సీ, మిరుదొడ్డి

# కబ్జా కోరల్లో పండ్లబోర కుంట



కుంటను కబ్జా చేసి పొలంగా మారుస్తున్న దృశ్యం

- అక్కన్నపేటలో నష్టపోతున్న ఆయకట్టు రైతులు
- కన్నెత్తి చూడని ఇరిగేషన్ అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): కబ్జాదారులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ భూములతో పాటు చెరువులు, కుంటలను సైతం ఆక్రమిస్తుండ టంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వివరా ల్లోకి వెళ్తే.. అక్కన్నపేట మండలం మైసమ్మవాగు తండా గ్రామ పరిధిలోని రంగస్వకుంట, ముబ్బు కుంట తండాల మధ్యనున్న పండ్ల బోరకుంట కబ్జాకు గురవుతోంది. 486 సర్వే నంబరులో సుమారు 2 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కుంట శిఖాన్ని కొందరు సమీప రైతులు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. మత్తడి ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. క్రమక్రమంగా శిఖం భూమిని ఆక్రమిస్తూ కుంట ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కబ్జా రాయుళ్లపై చర్యలు తీసుకొని, కుంట శిఖం భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ రమ్యశ్రీని సంప్రదించగా కుంట కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి రాలేదని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కుంట శిఖం వద్ద జరుగుతున్న పనులను నిలిపివేస్తాం.

మా కూతురు ప్రాణాలు

# కాపాడండి

- గుండె జబ్బుతో బాధపడుతున్న చిన్నారి
- దాతల సాయం కోరుతున్న తల్లిదండ్రులు



నారాయణఖేడ్: తమ కూతురు ప్రాణాలు కాపాడాలని తల్లిదండ్రులు దాతలను వేడుకుంటు న్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఖేడ్ మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటకు చెందిన బేగరి సాయిలు, నందిని దంపతుల కూతురు సాయి పల్లవి(6) ఏడాదిన్నర నుంచి గుండె జబ్బుతో బాధపడుతుంది. సాయిలు గ్రామ పంచాయతీ తాత్కాలిక ట్రాక్టర్ డ్రైవర్ కాగా, తల్లి వ్యవసాయ కూలీగా పని చేస్తూ జీవిస్తున్నారు. పాపకు మూడు నెలల కిందట నిమ్స్ ఆస్పత్రిలో రూ.10 లక్షల ఆపరేషన్ చేయించగా రూ.8లక్షల వరకు ఖర్చు అయ్యింది. ప్రస్తుతం పాప గుండెలో ఇన్ఫెక్షన్ రావడంతో మళ్లీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తిరిగి చికిత్స చేయడా నికి రూ.6 నుంచి రూ.7 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. నిరుపేద కుటుంబమైన తమ వద్ద అంత డబ్బు లేదని, దాతలు ఎవరైనా ఉంటే సాయం చేయాలని కోరుతున్నారు. సహాయం చేసే వారు 63050 37192 కు ఫోన్ పే లేదా, గూగుల్ పే ద్వారా డబ్బులు పంపించాలని వేడుకుంటున్నారు.

# గొర్రె పిల్లను కాపాడబోయి కాపరి మృతి



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

దుబ్బాకరూరల్: చెరువులో మునుగుతున్న గొర్రె పిల్లను కాపాడబోయి కాపరి మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామంలో శుక్ర వారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేర కు.. గ్రామానికి చెందిన గూడురు పెద్ద మల్ల య్య(52) రోజు మాదిరిగానే గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. ఆయనతోపాటు మరో ఇద్దరు గొర్రెలను ఒకే చోట మేపుతున్నారు. అందరూ వారి గొర్రెలకు నీళ్లు తాపడానికి గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లారు. ఒక గొర్రె పిల్ల నీళ్లు తాగడా నికి వెళ్లి అందులో మునిగి పోతుండగా గమనించిన మల్లయ్య కాపాడటానికి నీటిలోకి వెళ్లాడు. గొర్రె పిల్లను గట్టుకు చేర్చి మల్లయ్య మాత్రం నీటిలో మునిగిపోయాడు. తోటి కాపర్లు గమనించి అరుపులు, కేకలు వేయడంతో గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకొని పోలీసులకు సమాచారం అందిం చారు. మత్స్యకారుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీసి దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

### జేసీబీ గుంతలో పడి యువకుడు

మద్దూర్(గజ్వేల్): జేసీబీ గుంతలో పడి యువ కుడు మృతి చెందిన ఘటన మండలంలోని పాము లపర్తి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. మండలం లోని పాములపర్తి గ్రామానికి చెందిన మనిగిరిపు ఆంజనేయులు (19) గురువారం సాయంత్రం ఇం టి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో పలు చోట్ల వెతికారు. శుక్రవారం సాయంత్రం పాములపర్తి సమీపంలోని జేసీబీ గుంతలో పడి ఉన్న అతని మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు.

### కాలుజారి చెరువులో పడి వృద్ధుడు

దుబ్బాక: ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో చోటు చేసుకుం ది. ఎస్ఐ గంగరాజు కథనం మేరకు.. లచ్చపేటకు చెందిన తెల్ల నర్సయ్య (75) గురువారం సాయం త్రం మరుగుదొడ్డి కోసం ఇంటి సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవ శాత్తు చెరువు తూం వద్ద కాలుజారి నీళ్లలో బోర్లా పడిపోయాడు. అక్కడున్న వారు గమనించి కుటుం బ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నర్సయ్యను బయటకు తీసి సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెం దాడు. మృతుడి కుమారుడు మునేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ప్రమాదవశాత్తా.. ఆత్మహత్యా?

చెరువులో గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం



జయశ్రీ మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు

పటాన్‌చెరు టౌన్: చెరువులో గల్లంతైన మహిళ మృతదేహం లభ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బంధం కొమ్ము సాయిరాం హిల్స్‌లో నివాసం ఉండే రవి తేజ మొబైల్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తు న్నాడు. రవితేజ, భార్య జయశ్రీ, ఇద్దరూ జనవ రిలో మ్యూచువల్ డైవర్స్ అప్లయ్ చేసుకున్నారు. అప్పటి నుంచి జయశ్రీ (25) ఏపీలోని పిఠాపురం లో తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. గత నెల 28వ తేదీన రవితేజ తండ్రి జగన్మోహన్ మృతి చెందడం తో విషయం తెలుసుకున్న జయశ్రీ అత్తగారింటికి వచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో భర్త, నలుగుర్కు కూతురితో కలిసి అమీన్‌పూర్ పెద్ద చెరువు చూడటానికి వెళ్లింది. భర్త పాపతో కొంచెం దూరంలో ఉండగా జయశ్రీ ప్రమాదవశాత్తు పడిందా లేదా దూకి ఆత్మహత్యకు పాల్పడిందా తెలి యదు కానీ చెరువులో పడిపోయింది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రేటర్ విపత్తుల బృందం వచ్చి గాలించి జయశ్రీ మృతదే హాన్ని సాయంత్రం బయటికి తీశారు. ఏపీలోని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని తెలిపారు.

# చెట్టును ఢీకొన్న బైక్ : ఒకరి మృతి



ఘటనా స్థలంలో గాయాలతో మృతుడు

కొడిపల్లి(నర్సాపూర్): బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండల కేంద్రమైన కొడిపల్లి బట్టమ్మగుడి సమీపం లో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి కథనం మేరకు.. మండల కేంద్ర మైన కొల్చారం గ్రామానికి చెందిన మంగలి మల్లే శం(34) శుక్రవారం పని ఉందని బైక్‌పై కొడిపల్లికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. కొడిపల్లి బట్టమ్మ గుడి సమీపంలో జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మల్లేశం తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య స్వప్న, కొడుకు, కూతురు ఉన్నారు. మల్లేశం కొల్చారం మండలంలోని ఓ దిన పత్రిక విలేకరిగా పని చేస్తున్నాడు.

### మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడపు తూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించిం ది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామేశ్వర్ కథనం మేరకు.. పట్టణంలోని పలు చౌరస్తాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల కిందట వాహనాల తనిఖీ నిర్వహిం చారు. తనిఖీల్లో 30 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయ మూర్తి 30 మందికి రూ.14,600 జరిమానా విధించి నట్లు సీఐ తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఏడుగు రికి సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ కథనం మేరకు.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

# రాజీయే రాజమార్గం

నేడు జాతీయ లోక్ అదాలత్

- చిన్న, పెద్ద, దీర్ఘకాలిక కేసులు సత్వరమే పరిష్కారం
- కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- అవగాహన కల్పించిన న్యాయవాదులు
- సంగారెడ్డి జిల్లాలో 9 బెంచీలు ఏర్పాటు

లోక్ అదాలత్ కోసం నిర్వహించిన సమావేశం




సంగారెడ్డి టౌన్: కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా, జిల్లాలోని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. కక్షిదారులను ఒప్పించి సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసు లను పరిష్కరించేలా కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమంపై జిల్లా వ్యాప్తంగా ఆయా కో ర్టుల పరిధిలో న్యాయవాదులు, పోలీసు అధికా రులు, బ్యాంకర్లు, ఇన్సూరెన్స్ అధికారులకు అవగాహన కల్పించారు. రాజీయే రాజమార్గం ని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జడ్జీలు సూచిస్తున్నారు. శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

### పెండింగ్ కేసులు ఎక్కువగానే..

జిల్లా వ్యాప్తంగా పెండింగ్ కేసులు ఎక్కువ ఉన్నాయని వాటిని పరిష్కరించుకోవాలన్నారు. విద్యుత్, టెలిఫోన్ రికవరీ తదితర కేసులు వస్తాయి. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్క రించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ తగాదాలు, కుటుంబ తగాదాలు, రోడ్డు ప్రమాదాలు, మోటార్ వెహికల్ కేసులు, బ్యాంకుల రికవరీ కేసులు, ఆస్తి తగాదాలు ఇన్సూరెన్స్, చెక్ బౌన్స్ కేసులు, క్రిమినల్ కాంపౌండ్ కేసుల వంటివి రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించు కునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

### జిల్లా వ్యాప్తంగా 9 బెంచీలు

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయ డానికి జిల్లా వ్యాప్తంగా సంగారెడ్డిలో ఐదు బెం చీలు, జోగిపేటలో ఒకటి, నారాయణఖేడ్‌లో ఒకటి, జహీరాబాద్‌లో రెండు మొత్తం 9 బెం చీలు ఏర్పాటు చేస్తున్నారు. పెండింగ్ కేసులను తొందరగా పరిష్కరించేందుకు న్యాయవా దులు, పోలీసు అధికారులు విస్తృతంగా అవగా హన కల్పిస్తున్నారు. పెండింగ్ కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతున్న కక్షిదారులు లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయవా దులు సూచిస్తున్నారు.


#### విజయవంతం చేయాలి



జాతీయ లోక్ అదాలత్ విజయ వంతం చేయడానికి జిల్లా వ్యాప్తంగా 9 బెంచీలు ద్వారా లోక్ అదాలత్ నిర్వ హిస్తున్నాం. న్యాయవాదులు, పోలీసులు సహకరించాలి. రాజీమార్గం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించుకోవాలి. శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదా లత్ విజయవంతం చేయాలి.

– భవానీ చంద్ర, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

#### సద్వినియోగం చేసుకోవాలి



కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరిం చుకోవాలి. పెండిం గ్‌లో ఉన్న కేసులను ఇరువర్గాలు చర్చిం చి సమస్య పరిష్కరించుకోవాలి. జిల్లా కోర్టులో శనివారం ఉదయం 10.30 నుంచి జాతీయ లోక్ అదాలత్ ప్రారంభమ వుతుంది. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– విష్ణువర్ధన్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు